క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 17వ తేదీన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేఎస్ఆర్ గార్డెన్స్, ఐశ్వర్య గార్డెన్స్, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

కేసీఆర్ హాకీ టోర్నీ ప్రారంభం



నయీంనగర్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా నయీంనగర్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో షైన్ విద్యా సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి హాకీ టోర్నీని 54వ డివిజన్ శ్రీనగర్‌కాలనీలోని హాకీ మైదానంలో జాగృతి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుంటి రజిత, సోదా కిరణ్, నాయకులు శ్రీనివాస్, సోదా రామకృష్ణ, షైన్ విద్యా సంస్థల చైర్మన్ కుమార్ యాదవ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



హన్మకొండ కల్చరల్: హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని షిర్డిసాయిబాబా మందిరంలో శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి ప్రత్యేకపూజలు, రుద్ర హోమం, రాత్రి 12గంటలకు లింగోద్భావ కాలంలో మహాన్యాస రుద్రాభిషేకం జరుగుతుందని ఆలయ చైర్మన్ హరగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు రాకం సదానందం, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో దూసుకెళ్లాలి


హసన్‌పర్తి: విద్యార్థినులు సాంకేతిక రంగంలో దూసుకెళ్లాలని ఐఈఈఈ సెక్షన్ ఉమెన్ ఇన్ ఇంజనీర్, చైర్మన్ డాక్టర్ లక్ష్మి సూచించారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ ఇన్ క్లౌడ్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల్లో దాగున్న నైపుణ్యాలను గుర్తించి వాటిని వెలికి తీయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని గుర్తుచేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐఈఈఈ విభాగ అడ్వైజర్ రాము, ఏఓ వేణుగోపాల్, విద్యార్థి విభాగం ప్రతినిధులు వర్షిత, లహరి, జాహ్నవి, దివ్య, తన్వి, కావ్య, సరయు, నేహ, మధుమిత, అనిషా తదితరులు పాల్గొన్నారు.

గురుధామంలో మహాలింగార్చన



వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం రాత్రి మహాలింగార్చన (365 మట్టి లింగాలు) నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి సప్తధామంలో పూజ్య గురువు శివానందమూర్తి సన్నిధిలో మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ట్రస్టీలు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, రాంచందర్, నరేష్ మాట్లాడుతూ మహాలింగార్చన తర్వాత శివ పార్వతుల కల్యాణం జరుగుతుందని చెప్పారు. ఈ రెండు కార్యక్రమాలు ఓకే చోట ఒకే రోజు జరపడం అరుదని అన్నారు.

కేంద్ర నిధులతోనే రాష్ట్రం అభివృద్ధి



హసన్‌పర్తి: కేంద్ర నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. ప్రజల గోస – బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా జయగిరిలో బుధవారం రాత్రి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పిన కేసీఆర్.. తన ఇంటిలోనే ఐదు ఉద్యోగాలను భర్తీ చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలైన డబుల్ బెడ్రూం ఇళ్లు, ఎస్సీలకు మూడెకరాల భూమి పంపిణీ జాడే లేదని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. బూత్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ తాళ్లపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ వరంగల్ పార్లమెంటరీ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, నాయకులు కొంగంటి హేమంత్, విజయ్, సంతోష్, శివ పాల్గొన్నారు.

తుమ్ములు.. దగ్గులు!

- అపరిశుభ్రంగా యార్డులు.. మిర్చి ఘాటుతో ఇబ్బందులు
- ఏనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన ఎర్ర బంగారం

వరంగల్: రైతులు మిర్చి పంటను విక్రయించేందుకు పెద్ద ఎత్తున వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తున్నారు. సీజన్‌కు ముందుగానే సరుకు మార్కెట్ వస్తోంది. దీనికి తోడు పదును (తడి) ఉన్న మిర్చికి ఎక్కువగా ధర పెట్టేందుకు వ్యాపారులు ముందుకొస్తున్నారు. పూర్తిగా ఎండిన సరుకును రైతులు మార్కెట్‌కు తీసుకొస్తుండగా.. ఈ కారణంగా కొనుగోలు సమయంలో మిరపకాయ గల్లగా ఉండడం వల్ల విరిగిపోయి గింజలు కిందపడడంతో ఎక్కువగా ఘాటు వ్యాప్తి చెందుతున్నట్లు మార్కెట్ అధికారులు చెబుతున్నారు. దీంతో విక్రయానికి వచ్చిన రైతులతోపాటు మార్కెట్ అధికారులు, సిబ్బంది, హమాలీలు తుమ్ముతూ, దగ్గుతూ నానా అవస్థలు పడ్డారు.

కాగా.. ఈసారి సీజన్ కాస్త ముందుగా వచ్చిందన్న అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తున్నారు. యార్డులో ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, యార్డులు పూర్తిగా అపరిశుభ్రంగా తయారు కావడం ఇందుకు కారణమని చెప్పొచ్చు. మార్కెట్‌కు ఎక్కువగా తేజ యూఎస్–341 రకాలు విక్రయానికి వస్తాయి. సోమవారం తేజ రకం గరిష్టంగా క్వింటాకు రూ.17,900, కనిష్టంగా రూ.14వేలు, గురువారం గరిష్టంగా క్వింటాకు రూ.18,300, కనిష్టంగా రూ.14,500 పలికింది. అదే యూఎస్–341 రకం గరిష్టంగా క్వింటాకు రూ.21,100, కనిష్టంగా రూ.16వేలు, గురువారం గరిష్టంగా క్వింటాకు రూ.19,100, కనిష్టంగా రూ.15వేలు పలికింది. శనివారం శివరాత్రి పండుగ కావడంతో వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నందున శుక్రవారం ఎక్కువ మొత్తంలో బస్తాలు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

విధులు నిర్వర్తించలేం...

మార్కెట్‌లో మిర్చి ఘాటు విపరీతంగా లేస్తున్నందున యార్డుల్లో విధులు నిర్వర్తించలేకపోతున్నామని, తాగునీటి సౌకర్యం సరిగా లేదని మార్కెట్‌లో దడువాయి, హమాలీలు, కార్మికులు అంటున్నారు. యార్డును వారం రోజులుగా శుభ్రం చేయలేదని, అందువల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. మూడు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున ఈ పనులు నిర్వర్తిస్తున్న కార్మికులు రాకపోవడం వల్ల యార్డు బంద్ ఉన్న సమయంలో శుభ్రం చేయిస్తున్నట్లు తెలిసింది. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్నట్లు మార్కెట్‌లోని సంఘాలు తెలిపాయి. ఈ విషయంపై మార్కెట్ గ్రేడ్–1 కార్యదర్శి రాహుల్, ప్రత్యేక అధికారి, డీఎంఓ ప్రసాదరావు మాట్లాడుతూ యార్డులు శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీళ్లు చల్లించడంతోపాటు రైతులకు తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు.

యార్డులో 6 మిర్చి బస్తాలు మిస్సింగ్

వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో భద్రత లోపాలు మరోసారి బయటపడ్డాయి. గురువారం మార్కెట్‌కు తీసుకొచ్చిన ఒక రైతుకు సంబంధించి 6 మిర్చి బస్తాలు కనిపించకుండా పోయినట్లు తెలిసింది.



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి బస్తాలు

కాంటాలు అయ్యాక మార్కెట్‌కు వచ్చిన బస్తాలు.. (అధికారులు చెప్పినవి)

సోమవారం	32,120
మంగళవారం	35,257
బుధవారం	44,838
గురువారం	45,830

ఉజ్వల భవిష్యత్‌కు మైనార్టీ గురుకులాలు

న్యూశాయంపేట: దేశంలో ఎక్కడాలేని విధంగా పేద మైనార్టీ వర్గాల ఉన్నత విద్య కోసం 204 గురుకులాలు సీఎం కేసీఆర్ ఏర్పాటు చేశారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మైనార్టీ బాలికల గురుకులాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి గురువారం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మేన శ్రీను, ఆర్ఎల్‌సీ శ్రీపాల, ప్రిన్సిపాల్ ముత్తిరెడ్డి నీరజ, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, ఇండ్ల నాగేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

చెస్‌లో చీఫ్‌విప్‌ను ఓడించిన చిన్నారి

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను చెస్ ఆటలో మైనార్టీ గురుకులానికి చెందిన పదవ తరగతి విద్యార్థిని నాజ్నీన్ ఓడించింది. వినోద్‌కుమార్ కార్యక్రమం రాక ఆలస్యం కానుందని తెలియడంతో ముందే వచ్చిన చీఫ్‌విప్.. అక్కడే ఏర్పాటు చేసిన చెస్‌బోర్డుపై ఆటవిడుపుగా విద్యార్థిని నాజ్నీన్‌తో ఆడారు. ఆటలో వినయ్‌భాస్కర్ ఓడిపోయారు.



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

వరంగల్ నగరంతో 25 ఏళ్ల అనుబంధం



డైరీ ఆవిష్కరిస్తున్న అరవింద్ కుమార్, తదితరులు

వరంగల్ అర్బన్: వరంగల్ నగర కమిషనర్‌గా 25 ఏళ్ల కిందట పనిచేశానని, నగరంతో ఉన్న అనుబంధం మరువలేనిదని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. హనుమకొండ మినీ కలెక్టరేట్‌లో వరంగల్ మహానగర పాలక సంస్థ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డైరీ, క్యాలెండర్‌ను అరవింద్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం ఉదయం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ ప్రావీణ్య, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోన, శ్రీనివాస్‌రెడ్డి, జేఏసీ అధ్యక్షులు గౌరీ శంకర్, జేఏసీ నాయకులు శ్రీనివాస్, బొట్ల భిక్షపతి, ధర్మరాజు, రాజారపు భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

వజీర్‌ఖాన్ స్మారక కబడ్డీ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన మహ్మద్ వజీర్‌ఖాన్ మెమోరియల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త కృష్ణారెడ్డి మాట్లాడుతూ సూపర్‌లీగ్, నాకౌట్ పద్ధతిన ప్రతి ఆదివారం 5 వారాలు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు సోదా రామకృష్ణ, కార్యదర్శి ఎండి.అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు సృజన్‌కాంత్, రాంరెడ్డి, హనుమకొండ జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అజీజ్‌ఖాన్

ఉత్సాహంగా చదరంగం పోటీలు

కాశిబుగ్గ: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ ఇండోర్ స్టేడియంలో మహిళలు, బాలికలకు చెస్ చాంపియన్ షిప్ పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొని చెస్ ఆడారు. ఈ పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.ఇందిర ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు దేనిలో తక్కువ కాదని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కాగా, మొదటి బహుమతి బి.మాన్వి, రెండవ బహుమతి ఎ.హరిప్రియ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు సత్యవాణి, సుమన్, లింగమూర్తి, కుమారస్వామి, డీవైఎస్ఓ సిబ్బంది రాజేందర్, మౌనిక, అహ్మద్, మహేందర్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో..

హన్మకొండ చౌరస్తా: జిల్లా యువజన, క్రీడల ఇన్‌చార్జ్ అధికారి శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో చదరంగం పోటీలను గురువారం నిర్వహించారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీలను హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ పాల్గొని లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. హనుమకొండ జిల్లాకు చెందిన 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రథమ విజేతగా పి.సునీతారాణి, ద్వితీయ స్థానంలో ఎం.పూజిత నిలిచినట్లు శ్రీమన్నారాయణ తెలిపారు. క్రీడా సంఘాల బాధ్యులు సృజన్‌కాంత్, సతీష్, పాణి, కోచ్‌లు రమేష్, విష్ణువర్ధన్, నరేందర్, ప్రశాంత్, రాజు, శంకర్, అఫ్జల్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగిన నాటక పోటీలు

విద్యారణ్యపురి: సహృదయ సాహితీ సాంస్కృతిక సంస్థ రజోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో గురువారం రాత్రి నాటకాల ప్రదర్శన కొనసాగింది. తొలుత సభలో న్యాలకొండ భాస్కర్‌రావు అధ్యక్షతన సాగిన ఎస్‌బీఐ లైఫ్ డివిజనల్ మేనేజర్ అనిల్‌కుమార్, అనిల్ ఎలక్ట్రానిక్స్ లయన్ మోత్కూరు మనోహర్‌రావు పారితోషక దాతలు, ప్రముఖ న్యాయవాదులు మంగినపెల్లి సదాశివుడు, ఏరుగొండ జయశంకర్, రత్నాకర్‌రావు, చిన్నం రవీందర్ మాట్లాడారు. ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వరంగల్ ఆధ్వర్యంలో ఉన్నది ఒకటే జీవితం అనే నాటికను ప్రదర్శించారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ డీఎం అనిల్‌కుమార్

డాక్టరేట్ గ్రహీత మల్లేశ్వర్‌కు సన్మానం



మల్లేశ్వర్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన కాకతీయ యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ సంగని మల్లేశ్వర్‌ను పలువురు అభినందించారు. జర్నలిజం విభాగం పూర్వ విద్యార్థుల సొసైటీ కన్వీనర్ కపిలవాయి రవీందర్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో గురువారం మల్లేశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కోకన్వీనర్ వల్లపు మధు, జోన్ కమిటీ సభ్యులు అల్లం రాజేష్, బాధ్యులు పి.విష్ణువర్ధన్, వేమన, భాస్కర్, వంగాల సుధాకర్, బొట్ల మనోహర్, పెండ్యాల కొమురయ్య, నీలం ప్రనూప్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

హనుమాన్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదం

వరంగల్/ఎంజీఎం: వరంగల్ – ఏటూరునాగారం జాతీయ రహదారిపై హనుమకొండ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. ధర్మసాగర్‌కు చెందిన కిరణ్, ల్యాదెళ్లకు చెందిన రాజేందర్, పైడిపల్లికి చెందిన కుమారస్వామి పండ్లు కొనుగోలు చేస్తుండగా పరకాల నుంచి వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. దాంతో వారి కాళ్లు విరగడంలో ఫైర్ స్టేషన్ అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రయాణికులకు లగేజీ, నగదు అప్పగింత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రయాణికుల బృందం తమ లగేజీలు, బ్యాగులు, నగదును రైలులో మరచిపోగా కాజీపేట, జనగామ జీఆర్పీ పోలీసులు సకాలంలో స్పందించి తిరిగి వారికి అప్పగించారు. సకాలంలో స్పందించిన కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, కానిస్టేబుళ్లు నరేష్, రజితను అధికారులు ప్రశంసించారు.

వాహనదారులపై చీటింగ్ కేసు

ఖిలా వరంగల్: వాహనం నంబర్ ప్లేట్ మీద స్టిక్కర్ అతికించి, నంబర్లు కనిపించకుండా చేసి రోడ్లపై తిరుగుతున్న ఏడుగురు వాహనదారులపై చీటింగ్ కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. శంభునిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో ఎస్సైలు రామారావు, రాజబాబు, డేవిడ్ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు నిర్వహించారు.

ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో ఘర్షణ

ఖిలా వరంగల్: వరంగల్ ఇసుక అడ్డా జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఓల్డ్ ఫర్నిచర్ షాపుల్లో గురువారం సాయంత్రం ఇరువురు యజమానులు గొడవపడ్డారు. ఆర్థిక లావాదేవీల విషయంలో ఇరువురు భేటీ అయ్యారు. ఈక్రమంలో మాటామాట పెరగగా, పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ దాడుల్లో ముగ్గురు గాయపడినట్లు తెలిసింది. ఈమేరకు బాధితుడు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు గాయపడిన ముగ్గురిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు.

సంక్షిప్తంగా

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ క్రైం: వేయి స్తంభాల దేవాలయంలో జరగనున్న శివరాత్రి వేడుకల ఏర్పాట్లను సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ గురువారం పరిశీలించారు. భక్తుల రద్దీకి సరిపడా బందోబస్తు ఏర్పాటు చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డీసీపీని ఆలయ అర్చకుడు గంగు ఉపేందర్‌శర్మ సన్మానించారు. డీసీపీతో పాటు హనుమకొండ ఇన్‌చార్జ్ ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ జీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఉన్నారు.

చిత్రాన్ని ఆదరించండి

నయీంనగర్: జాహ్నవి మూవీ మేకర్స్ ప్రొడక్షన్‌లో వరంగల్‌కు చెందిన నూతన నటీనటులతో వస్తున్న 'భీం భూమికి జై' చిత్రాన్ని వరంగల్ ప్రజలు తిలకించి ఆదరించాలని డైరెక్టర్ కంజర్ల సందీప్, సినీ హీరో అభిలాష్ (వహబ్) కోరారు. ఈమేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ చిత్రం ట్రైలర్ ఈనెల 13న విడుదలయిందని చెప్పారు. సమాజంలోని అసమానతలు తొలగించాలంటే చదువు ఒక్కటే మార్గమని తెలపడమే ఈ చిత్రం ఇతివృత్తమని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్, నటులు రాజు, పవన్, చందు, సంజీవ్, నష్య, విశ్వంజీ, విష్ణు, రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట విద్యానగర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో కార్మిక శాఖ సహకారంతో కార్మిక రత్న యమడాల అనుకాంత్ అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 76 మంది భవన కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్మికశాఖ జాయింట్ కమిషనర్ సునీత, వరంగల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.సామ్యేల్ జాన్, కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌రావు, సీఎస్‌సీ రాష్ట్ర మేనేజర్ శశికాంత్, సీఎస్‌సీ హెల్త్‌కేర్ డాక్టర్ దుర్గప్రసాద్, కార్మికశాఖ అధికారులు మాట్లాడారు. శుక్రవారమూ క్యాంప్ కొనసాగుతుందని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రామన్నపేట: 29వ డివిజన్ రామన్నపేటకు చెందిన ప్రణీత ఇటీవల బావలో నీళ్లు తోడుతూ ప్రమాదవశాత్తు మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చీఫ్‌విప్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కల్పలత సూపర్‌బజార్ వైస్ చైర్మన్ షఫి, డివిజన్ అధ్యక్షుడు సదాంత్, నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ: హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో గురువారం జరిగిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి విద్యుత్ ఉద్యోగులు తరలివెళ్లారు. హనుమకొండ నక్కలగుట్ట నుంచి తరలివెళ్లిన వాహనాలను అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తార్య, స్వదేశ్ కుమార్, వస్కుల కృష్ణ, కుమార స్వామి, జడల రవి, విజయ్, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజీవ్ కుమార్



హన్మకొండ: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వికారాబాద్ జిల్లా పరిగి మండలం, రావులపల్లి గ్రామానికి చెందిన బొట్లపల్లి సంజీవ్ కుమార్‌ను నియమించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు.

ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధిగా యాదగిరి



ఖిలా వరంగల్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధికార (స్పోక్ పర్సన్) ప్రతినిధిగా జన్మభూమి జంక్షన్ రోడ్డు లక్ష్మీనగర్‌కు చెందిన మెంతుల యాదగిరి నియమితులయ్యారు. ఈమేరకు మెంతుల యాదగిరికి బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ నియామక పత్రం అందజేశారు.

యాజమాన్యంపై చర్య తీసుకోవాలి

కాశోజీ సెంటర్: పోచమ్మ మైదాన్‌లో స్కాలర్ జూనియర్ కళాశాల పేరుతో అనుమతి పొంది.. విద్యా కళాశాల పేరుతో నడిపిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీఐఈఓ మాధవరావుకు వినతిపత్రం అందించారు.

'బ్రహ్మకుమారీల' శివలింగ దర్శనం



నయీంనగర్: శివనామ స్మరణే పాప విమోచనంగా భావిస్తూ ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగే శివరాత్రి అని రాజయోగిని బ్రహ్మకుమారి బికె.సవిత అన్నారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హనుమకొండ ఏనుగులగడ్డ వద్ద నాలుగు రకాల లింగోద్భావం, సహస్ర శివలింగ దర్శనం, అదృశ్య హస్తాలతో పరమ శివుడికి క్షీరాభిషేకం, హోలోగ్రాఫిక్ 3డీ శివలింగ దర్శనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం 16వ తేదీన సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమై శుక్ర, శనివారం కొనసాగుతుందని చెప్పారు.

బండా ప్రకాశ్‌కు శుభాకాంక్షలు

హన్మకొండ: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను హనుమకొండలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా అధికారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనర్ రంగనాథ్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, బల్దియా కమిషనర్ ప్రావీణ్య, జిల్లా రెవెన్యూ అధికారి వాసుచంద్ర మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



ప్రకాష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీపీ, కలెక్టర్

కాశీ విశ్వేశ్వరాలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

కాశిబుగ్గ: కాశిబుగ్గలోని చారిత్రక కాశీ విశ్వేశ్వరాలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు గురువారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ యాగశాలలో రుద్రసహిత చండీహోమం సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి హోమంలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వరుడి ఉత్సవ విగ్రహాన్ని కాశిబుగ్గ వీధుల్లో ఊరేగించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు వడిచెర్ల సదానందం, గుండేటి కృష్ణమూర్తి, శ్రీరాములు పెద్దన్న, ఆడెపు మల్లికార్జున్, కుసుమ దయాసాగర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దు

మామునూరు: పరీక్షలు అనగానే విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దని, స్వేచ్ఛ, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ అజయ్‌బాబు, కొండా యాదగిరి సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం శ్రీనిధి శర్మ అధ్యక్షతన మండల స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సొంతమవుతుందని అన్నారు. విజయం కోసం చిన్నపాటి చిట్కాలను పాటించాలని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌బాబు

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం



కంటి పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని హసన్‌పర్తి మండల కేంద్రంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కంటి పరీక్షలు చేశాక అవసరమైన వారికి అద్దాలు కూడా అందజేస్తున్నట్లు చెప్పారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ వాణిశ్రీ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు పావుశెట్టి శ్రీధర్, నరేడ్ల శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, ఆత్మ జిల్లా చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మృతి చెందిన 2వ డివిజన్ గుండ్లసింగారానికి చెందిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త బొజ్జ సువర్ణ పేరు మీద విడుదలైన రూ.2 లక్షల బీమా చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

కరీమాబాద్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టంను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. పాఠశాలల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయులు కరుణాకర్, రేఖ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో డాక్టర్ కడియం కావ్య